# క్షణికం

బాలు ఏటి ఒడ్డున నడుస్తున్నాడు.

ఈ మధ్య పడ్డ వర్షాలకు ఏరు నిండుగా ప్రవహిస్తున్నది. సూర్యుడు అస్తమించబోతూ గులాబీ రంగుల్ని నదిమీద అద్దాడు. ప్రకృతిలోని అద్భుతాలలో సూర్యాస్తమయం, ఉషోదయం ఎప్పటికీ సౌందర్య పిపాసుల్ని ఆకర్షిస్తాయి. ఏదో ఆలోచనలో మునిగి ఉన్న బాలుకు 'బుడుంగు' మని శబ్దం వినిపించింది.

ఆ శబ్దం వచ్చిన వైపు చూశాడు.

నీటిలోని అలలు చెదిరిపోతున్నాయి.

నదిలో ఏదో కల్లోలం!

ఒక లిప్తపాటు ఓ చీరె...నల్లరంగు జుట్టు కనిపించి మాయమైంది.

బాలు ఏం ఆలోచించకుండా అక్కడి దాకా పరుగెత్తుకుంటూపోయి ఏటిలో దూకాడు.

చల్లటి నీళ్లలో తనూ మునిగిపోయి నీళ్లలో ఈతకొడ్తూ ఆమె కోసం గాలించాడు. కొన్ని క్షణాల్లో అతనికి ఆమె శరీరం తగిలింది.

బలంగా ఆమె జుట్టు పట్టుకుని ఈదుకుంటూ ఒడ్డుకు లాక్కొచ్చాడు.

ఒడ్డు మీద పడేసిన తర్వాత భాస్కరుని బంగారు కిరణాలలో ఆమెని చూశాడు.

పదహారేళ్ల పసిడి వన్నెలపడుచు!

సౌందర్యానికి ప్రతిరూపం!

బంగారు రంగు మేనితో...అద్భుతమైన ముఖకవళికలతో మెరిసిపోతున్నది.

బాలుకు తన కర్తవ్యం స్ఫురించింది. వెంటనే ప్రథమ చికిత్స ప్రారంభించాడు.

ఆమె పొట్టను బలంగా మోకాలితో నొక్కి నీళ్లను కక్కించాడు. చేతులు మీదుగా లేపి కొంచెం ఏటవాలుగా వంచాడు.

నీళ్లు బొడ బొడ కారిపోయాయి.

కాసేపటికి ఆమె కళ్లు తెరిచింది.

భయంతో ఆమె పెదవులు వణుకుతున్నాయి.

ఆమె ముంగురులు సవరించాడు.

ఆమె మరింత బిగుసుకుపోయింది.

"ఏం భయం లేదు.. ప్రమాదం తప్పిపోయింది" బాలు చెప్పాడు.

ఆమె ఏడవడం ప్రారంభించింది. మోకాళ్ల మీద కూర్చుని ఏడుస్తున్నది.

బాలుకు జాలికలిగింది.

"మీ ఇల్లెక్కడో చెపితే...దిగబెడతాను."

"నన్ను ఎందుకు రక్షించారు?" గద్గదిక స్వరంతో అడిగింది.

"అంటే. కాలుజారి ఏటిలో పడలేదా? ఆత్మహత్య చేసుకోబోయావా?!" ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు.

"నా కర్మ కొద్దీ మీరు రాకుండా ఉంటే...హాయిగా చచ్చిపోయి ఉండేదాన్ని!" ఎక్కిళ్లు పెడుతూ అంది.

"మిస్..నీ పేరేమిటో_"

"సంధ్య!"

"సంధ్య! ఓహ్! ఎంత అందమైన పేరు! ఎందుకింత ధైర్యం చేశావు? నీకొచ్చిన

కష్టమేమిటో?"

"మీరెవరో నాకు తెలీదు?"

"నా పేరు బాలు! యమ్మే పాసయ్యాను. ప్రస్తుతం నిరుద్యోగం నా ఉద్యోగం!"

"అయితే మీకు మా సమస్య అర్థంగాదు."

"అర్థమయ్యేట్టు చెప్పు. ఎందుకు ఆత్మహత్య చేసుకుందామన్న నిర్ణయానికి వచ్చావు?"

"ఇవ్వాళ పేపరు చూడలేదా? టెన్త్ రిజల్ట్సువచ్చాయి! నా నెంబరు లేదు. నేను ఫెయిలయ్యాను. నా మొహం ఈ లోకానికి ఎలా చూపించను?" ఆమె ఏడుస్తూ చెప్పింది.

ఉన్నట్టుండి అతను పెద్దగా నవ్వాడు. పడీపడీ నవ్వాడు. అతని నవ్వు గాలిలో కలిసిపోయింది. చెట్ల మీద వాలబోతున్న పక్షులు కలవరంతో లేచిపోయాయి.

"ఏం? నే ఫెయిలవడం మీకంత ఆనందాన్ని ఇచ్చిందా?" రోషంగా అడిగింది సంధ్య."కాదు సంధ్యా! ఇంత చిన్న కారణానికి నువ్వు ఆత్మహత్య చేసుకుందామని ప్రయత్నించడం నాకు నవ్వు తెప్పించింది"

"నా సమస్య మీకు చిన్నదిగానే కనిపించవచ్చు. కానీ ఫస్టు క్లాసులో పాసవుతానని పేరెంట్స్‌కి చెప్పాను. కానీ అస్సలు నా నెంబరే లేదు. ఫెయిలయ్యాను. నేను బాగా రాశానని చెప్పినా ఎవ్వరూ నమ్మరు. ఉత్తకోతలు కోశానంటారు. అందుకే అవమానం భరించలేక ఇలా నదిలోకి దూకాను" సంధ్య చెప్పింది.

బాలు తీక్షణంగా ఆమె కళ్లలోకి చూశాడు.

'టెన్త్ పరీక్ష ఒక పరీక్ష! అది ఫెయిల్ కావడం లైఫ్‌లో ఒక షాకా! హా హా!"

"యమ్మే పాసైన వాళ్లకు అలానే అనిపిస్తుంది."

"సంధ్యా! నువ్వు ఫస్టుక్లాసులో పాసయ్యావనుకో- తర్వాత ఏం చేద్దామనుకున్నావు?"

'మెడిసిన్ రాద్దామనుకున్నాను...సీటు దొరక్కపోతే కనీసం లెక్చరర్ అవుదామనుకున్నాను."

"అంటే... ఇంటర్ అయిన తర్వాత ప్రణాళిక అంతేగా.. మొదటి మెట్టు టెన్త్! ఆదిలో హంసపాదు"

"అమ్మయ్య! మీ కర్థమయింది...నా ఆశల సౌధం ఎలా కుప్పకూలిపోయిందో." సంధ్య దుమ్ము దులుపుకుంటూ అంది.

"సరే! నువ్వు మెడిసిన్‌లో చేరి డాక్టరయ్యావనుకుందాం...తర్వాత ఏం చేస్తావు?"

"భలేవారే! డాక్టరుగా ప్రాక్టీసన్నా పెడతాను. గవర్నమెంట్ జాబ్ వస్తే జాబ్‌లో చేరతాను."

"ఊ తర్వాత"?

"తర్వాతేముంది- డబ్బు సంపాదిస్తాను. ప్రజలకు సేవ చేస్తాను.. దట్సాల్!" ఊహల్లో తేలిపోతూ చెప్పింది సంధ్య.

"సరే! నీ జీవితాశయం డబ్బు సంపాదించడం..."

"నో...ప్రజలకు సేవ చేస్తూ డబ్బు సంపాదించడం" సర్ది చెప్పింది సంధ్య

'ఓకే సంధ్యా! ప్రజలకు సేవ చెయ్యాలంటే మెడిసినే చదవాలా? డబ్బు సంపాదించాలంటే డాక్టరే కావాలా?" సూటిగా అడిగాడు.

"ఏమో! నేను మటుకు అలా చేద్దామని నిర్ణయించుకున్నాను."

"అదృష్టవంతులకు అన్నీ అనుకున్నట్లు జరుగుతాయి. మనలాంటి దురదృష్టవంతులకు మటుకు అలా జరగవు. అప్పుడు మనం కాస్త జీవితాలతో రాజీ పడిపోయి బతకాలి...

అంతేకాని ఆత్మహత్య చేసుకోకూడదు" చెప్పాడు ఆమె చెయ్యిని తన చేతిలోకి తీసుకుంటూ.ఆమె కనురెప్ప వాల్చకుండా వింటున్నది."

"ఈ సంవత్సరం మన లక్ష్యం నెరవేరకపోతే వచ్చే సంవత్సరం మనం అనుకున్నది సాధించవచ్చు. జీవితం నూరేళ్లపంట! మనం సాధించాలి అంటే మనం బతికుండాలి".

"బాలూ! మీరు నన్ను కాపాడ్డం నా అదృష్టం! మీరు చెప్పింది నిజమే! క్షణికా వేశంలో తొందరపడి నిర్ణయాలు తీసుకోకూడదు. నా లక్ష్యం సాధించడానికి నేను నిరంతరం పోరాడతాను. మీరన్నట్టు ఎన్నో రకాలుగా డబ్బు సంపాదించవచ్చు. ఆ మాటకొస్తే మాకున్న ఆస్తి మాకు చాలు.. ఇంక సంపాదించాల్సిన అవసరం కూడా లేదు" సంధ్య అతని కళ్లల్లోకి చూస్తూ చెప్పింది.

"సంధ్యా! పద.. మీ ఇంటికి వెళదాం" అడుగు ముందుకేస్తూ అన్నాడు.

"చాలా థాంక్స్! మీ రుణం తీర్చుకోలేను... సమయానికి మీరు రాకపోతే..."

"నో.. నేనే నీకు రుణపడి ఉన్నాను. ఆ సమయానికి నువ్వు ఆత్మహత్యకు పాల్పడి ఉండకపోతే..." మాట పూర్తి చేయకుండా కిందకూలబడి ఏడ్చేశాడు బాలు.

సంధ్య బిత్తరపోయింది.

"బాలూ! ఎందుకేడుస్తున్నారు? మీ రేడిస్తే నాకు భయమేస్తున్నది. ప్లీజ్! ఊరుకోండి!" సంధ్య తనూ కంట తడిపెడ్తూ అడిగింది.

"సంధ్యా! నిన్ను రక్షించడానికికనీసంనేనువచ్చాను కానీనన్ను రక్షించడానికిఎవరు వచ్చేవాళ్ళు?"

"నాకేం అర్థం కావడం లేదు మీ మాటలు?"

"ఏముంది...నేనూ ఆత్మహత్య చేసుకుందామనే వచ్చాను. ఈలోగా నువ్వు దూకావు.. నిన్ను రక్షించే ప్రయత్నంలో నా ప్రయత్నం తాత్కాలికంగా...." బాలు తలవంచుకుని చెప్పాడు.

"బాలూ! ఇందాక మీరే నాకు చెప్పారుగా! ఎందుకింత తొందరపాటు నిర్ణయం తీసుకున్నారు?!" విస్మయంగా అడిగింది సంధ్య వణికిపోతూ.

"పేదరికం..నిరుద్యోగం !"నిరాశగా అన్నాడు.

"ఇంత చిన్న విషయానికి ఆత్మహత్యా!" ఆశ్చర్యపోయింది సంధ్య.

"సంధ్య! ఆత్మహత్య చేసుకునేది క్షణికోద్రేకంలోనే! ఆక్షణం గడిస్తే మన ఆలోచన ఎంత తప్పో మనకే అర్థమవుతుంది. నిన్ను ఓదార్చడానికి ప్రయత్నిస్తున్నపుడే నానిర్ణయం ఎంత హాస్యాస్పదమో నాకర్థమయింది"బాలు బాధగా చెప్పాడు.


"బాలూ! ఏం ఉద్యోగం చేస్తూ ఈ పక్షులు- పశువులు బతుకుతున్నాయి?" సంధ్య అడిగింది.

"సంధ్యా! ఏ పరీక్ష పాసయ్యామని ఈ పక్షులు ఈ పశువులు సంతోషంగా ఉన్నాయి" బాలు అడిగాడు.

ఇద్దరికీ నవ్వు వచ్చింది.

ఆనందంగా చేతిలో చేయి వేసుకుంటూ ముందుకు నడిచారు.

వాళ్లిప్పుడు జీవితంలోంచి పారిపోవడం లేదు జీవితంలో జొరబడుతున్నారు!



(ఆదివారం ఉదయం 21.4.93)